## కిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స..

అతిపెద్ద కణితిని తొలగించిన వైద్యులు






# బలగం TV

BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం, 18 మే-2025 balagamtv100@gmail.com పేజీలు-4



## కేంద్రం సంచలన నిర్ణయం





# కోటి మంది మహిళలని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

## సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్-ఇందిరా గాంధీ ప్రపంచానికి మహిళా శక్తి ఏంటో చూపించారని.. తెలంగాణలో ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే కోటి మంది మహిళలు కోటీశ్వరులవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని చెప్పుకొచ్చారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో నిర్వహించిన 'వీ హబ్ ఉమెన్ యాక్సిలరేషన్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి మరోసారి గుర్తు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన మహిళల స్టాళ్లను కూడా సందర్శించి, ఆ తరువాత తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకి ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని అందించామని చెప్పారు. గ్యాస్ సిలిండర్‌ను రూ. 500కే అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 'అమ్మ ఆదర్శ పాఠశాలల' నిర్వహణను మహిళలే చూసుకుంటున్నారని వివరించారు. ఈ నెల 21న జరిగే కార్యక్రమంలో 'మిస్ వరల్డ్' కంటెస్టెంట్లు మహిళా స్టాళ్లను సందర్శించనున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళల స్వయం సహాయక సంఘాలు ఎంతో విజయవంతంగా నడుస్తున్నాయని సీఎం వెల్లడించారు. సభ్యుల సంఖ్యను కోటి వరకు పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కార్పొరేట్ కంపెనీలకు అప్పు ఇచ్చినప్పుడు వారు అప్పు ఎగ్గొట్టి దేశం విడిచి వెళ్తున్నారని.. కానీ మన మహిళలు తీసుకున్న రూపాయిని వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తున్నారని వివరించారు. శిల్పారామంలో మహిళల ఉత్పత్తుల ప్రదర్శన కోసం ప్రత్యేక స్టాళ్లు కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మీ రేవంతన్నగా, మీ కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలన్నదే ప్రభుత్వ ఆశయమని చెప్పారు. వ్యాపారాల నిర్వహణ.. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ వ్యాపారాన్ని ఇప్పటికే మహిళలకు అప్పగించామని రేవంత్ రెడ్డి చెప్పారు. సమర్థవంతంగా నిర్వహిస్తే మరికొన్ని అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే అతిథులకు గిఫ్ట్‌లుగా కూడా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ఇవ్వడం జరుగుతుందని వివరించారు. విద్యార్థుల యూనిఫార్మ్ కుట్టు పనిని మహిళా సంఘాలకే అప్పగించామని, అలాగే పెట్రోల్ బంకులు, సోలార్ వ్యాపారాలు, ఇతర సంస్థల నిర్వహణకు మహిళల్ని ప్రోత్సహిస్తున్నామని అన్నారు.

## వీసా గడువు దాటితే తిరిగి వెళ్లిపోండి..

### భారతీయులకు అమెరికా ఎంబసీ వార్నింగ్



న్యూఢిల్లీ, మే 17: వీసా గడువు ముగిసినా అమెరికాలో ఉంటున్న భారతీయు లను ఉద్దేశించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీచేసింది. ఈ అంశంలో ఉల్లంఘనలకు పాల్పడితే ఎదుర్కోవాల్సి న తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడించింది. వీసా రూల్స్‌ను ఉల్లంఘిస్తే బహిష్కరణ ముప్పు తప్పదని, అదేవిధంగా భవిష్యత్తులో అమెరికాకు ప్రయాణంపై శాశ్వత నిషేధం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టింది.టూరిస్ట్, స్టూడెంట్స్, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తున్న భారతీయులను ఉద్దేశించి అమెరికా ఎంబసీ ఈ హెచ్చరిక చేసింది. అమెరికా ప్రయాణంపై నిషేధం పడితే భవిష్యత్తులో అక్కడ చదువు, వృత్తి, వ్యక్తిగత అవకాశాలపై గణనీయమైన ప్రభావం పడనుంది. నిర్దేశిత గడువు ముగిసినా అనుకోని పరిస్థితుల కారణంగా దేశాన్ని వీడటంలో ఇబ్బందులు ఏర్పడితే.. చట్టపరమై న పరిణామాలు ఎదుర్కోకుండా ఉండేందుకు యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ను సంప్రదించాలని ఎంబసీ అధికారులు సూచించారు.ఇదిలావుంటే అమెరికాలో గడువుకు మించి ఉంటున్నవారు తక్షణమే దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని అక్కడి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం గతంలోనే హెచ్చరికలు చేసింది. 'అమెరికాలో 30 రోజులకపైగా నిబంధనలకు మించి నివసిస్తున్నవారు కచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు. అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి' అని హెచ్చరించింది.

## బంగాళాఖాతంలో ఆవర్తనం

# భారీ వర్షాలు

నైరుతి రుతుపవనాలు ఇప్పటికే బంగాళాఖాతాన్ని తాకాయి. బంగాళా ఖాతం దక్షిణ ప్రాంతం, అండమాన్ నికోబార్ దీవులకు సమీపించాయి. అండమాన్ ఉత్తర సముద్రంలో ప్రవేశించాయని, అవి మరింత చురుగ్గా విస్తరించడానికి అనుకూల వాతావరణం ఉందని అటు భారత వాతా వరణ కేంద్రం వెల్లడించింది.అరేబియా, బంగాళాఖాతం దక్షిణ ప్రాం తాలు అండమాన్- నికోబార్ అంతటా రుతు పవనాలు విస్తరిస్తోన్నాయి. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. క్రమంగా- జూన్ 1వ తేదీ కంటే ముందే అంటే.. మే 27 నాటికే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వివరించింది.అదే సమయంలో బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఈ నెల 20- 22వ తేదీ నాటికి ఇది మరింత బలపడనుంది.. అల్పపీడనంగా మారనుంది. 23 నుంచి 28వ తేదీల మధ్య తుఫాన్ గా ఆవిర్భవించ డానికి అనుకూల వాతావరణం నెలకొని ఉంది. దీనికి శక్తి అని పేరు పెట్టారు. బంగాళాఖాతం దక్షిణ ప్రాంతం గగనతలంపై 1.5 నుంచి 7.5 కిలోమీటర్ల ఎత్తున ఆవరించింది ఉందీ ఆవర్తనం. ఇది మరింత బలపడానికి అనుకూల వాతావరణం నెలకొని ఉంది. మూడు రాష్ట్రాలు- ఏపీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ పై దీని ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది.దీని ప్రభావం ఏపీ సహా దక్షిణాదిన మూడు రాష్ట్రాలపై పడింది. ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. పలు జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బెంగళూరులో వర్షం దెబ్బకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు- కోల్ కత నైట్ రైడర్స్ మ్యాచ్ ఆలస్యమైంది.

# ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణ ముహూర్తం ప్రకటన

హైదరాబాద్-మే 17: తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. రేవంత్ ఏడాది పాలన పూర్తి చేసుకు న్న సమయంలోనే మంత్రివర్గ విస్తరణ దిశగా కసరత్తు జరిగింది. అయితే, సమీకరణాలు.. ఎంపిక విషయంలో స్పష్టత లేకపోవటంతో వాయిదా పడింది. అప్పట్లోనే మంత్రులుగా పేర్లు ఖరారైనట్లు ప్రచారం సాగింది. ఇక, ఇప్పుడు మంత్రివర్గ విస్తరణకు పార్టీ అధినాయకత్వం ఆమోద ముద్ర వేసింది. కొత్తగా అవకాశం ఇవ్వాల్సిన పేర్లను ఖరారు చేసింది. ప్రస్తుత మంత్రివర్గంలో ఒకరిని తప్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. పలువురి శాఖల్లో మాత్రం మార్పులు జరగనున్నాయి. టీపీసీసీ చీఫ్ వెల్లడి మంత్రివర్గ విస్తరణపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెలాఖరులో లేదా జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందని అన్నారు. వివిధ సమీకరణాల వల్లే మంత్రివర్గ విస్తరణలో కొంతమేర జాప్యం జరుగుతోందని చెప్పారు. తమ ప్రభుత్వంలో మంత్రులు అందరూ కలిసే ఉన్నారని కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఉన్న అవసరాలు తీర్చడమే తమ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని స్పష్టం చేసారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేసారు. టీపీసీసీ కొత్త కార్యవర్గం సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన



వారిపై సైబర్ క్రైమ్‌లో కేసు పెడతామని హెచ్చరిం చారు. ఈనెల 26, 27 తేదీల్లో టీపీసీసీ కార్యవర్గం ఖరారయ్యే అవకాశం ఉందని అన్నారు. తెలంగాణలో సీఎం మార్పు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారమేనని విమర్శించారు. బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోందని ఆరోపించారు. మహిళా కాంగ్రెస్ ఆందోళన సర్వ సాధారణం, మహిళలకు కాంగ్రెస్‌లో ఉన్న ప్రాధాన్యం మరే పార్టీలో లేదని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇక, మంత్రివర్గ విస్తరణ పైన హైకమాండ్ వద్ద ఇప్పటికే చర్చలు జరిగాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు పైన రాహుల్ గాంధీ

## 29 నుంచి దేశవ్యాప్తంగా వ్యవసాయ సంకల్ప్ అభియాన్



సైదాబాద్, మే 17: కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన కృషి సంకల్ప్ అభియాన్ దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని సెంట్రల్ డ్రైలాండ్ వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా) డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 12 వరకు దేశవ్యాప్తంగా 700కి పైగా జిల్లాల్లో కొనసాగుతుందని కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో జరిగిన సమావేశంలో ప్రకటించారని ఆయన తెలిపారు.వ్యవసాయ శాస్త్రవేత్తలు, మంత్రిత్వ శాఖ అధికారులు, ఉద్యోగులు, స్థానిక కార్మిక సంఘాలతో బృందాలుగా ఏర్పాటు చేసి ప్రతిరోజు వివిధ గ్రామాలను సందర్శిస్తారని ఆయన తెలిపారు. రైతులతో నేరుగా సంభాషించి వ్యవసాయం గురించి అవగాహన కల్పించి, తగిన సలహాలను ఇస్తారని అన్నారు. ప్రయోగశాల నుంచి భూమికి అనే మంత్రాన్ని సహకారం చేసుకునేందుకు జరుగుతున్న ఈ అభియాన్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆధునిక, ఆదర్శ వ్యవసాయంతో పాటు ఒక దేశం, ఒక వ్యవసాయం, ఒక బృందం అనే నినాదంతో దేశవ్యాప్తంగా 731 ఖుషి విజ్ఞాన కేంద్రాలు 100కు పైగా ఐసీఏఆర్ కేంద్రాలకు చెందిన అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని రైతుల వద్దకు నేరుగా వెళ్లి క్షేత్రస్థాయిలో అధికారులు వివిధ అంశాలపై చర్చించి సలహాలు ఇస్తారని, రైతుల సందేహాలను పూర్తి చేస్తారని నివృత్తి చేస్తారని పేర్కొన్నారు.

# భారత్ దెబ్బ.. కుప్పకూలిన టర్కీ ఆర్థిక వ్యవస్థ..



న్యూఢిల్లీ, మే 17: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సిం ధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ దాడులకు కౌంటర్ గా పాకిస్థాన్ భారత్ లోని కాశ్మీర్, పంజాబ్ సరిహద్దు ప్రాంతాలపై డ్రోన్లతో దాడి చేసింది. పాక్ నుంచి దూసుకొచ్చిన దాదాపు 600 డ్రోన్లను సమర్థవంతంగా నేల కూల్చినట్లు భారత రక్షణశాఖ పేర్కొ ంది. అయితే ఈ డ్రోన్లు టర్కీ దేశం.. పాకిస్థాన్ కు సరఫరా చేసిం ది. దీంతో టర్కీపై భారత్ లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ నేపథ్యంలోనే బాయికాట్ టర్కీనినాదం దేశవ్యాప్తంగా ఊపందుకుంది. టర్కీ ఉత్ప త్తులను భారత్ లో బ్యాన్ చేయాలని పలు వ్యాపార సంఘాలు

# బంగ్లాదేశ్ కు చావుదెబ్బ కొట్టిన కేంద్ర ప్రభుత్వం..

పొరుగు దేశం బంగ్లాదేశ్ కు వ్యాపారపరంగా చావుదెబ్బ కొట్టింది భారత్. ఆ దేశం నుంచి దిగుమతి చేసుకునే పలు రకాల వస్తువులు, ఆహార పదార్థాలపై ఆంక్షలు విధించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ కొద్దిసేపటి కిందటే ఓ నోటిఫికేషన్ జారీ చేసింది.హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులు, గృహ దహనాలు, అఘాయిత్యాలు, ఆకృత్యాలతో అట్టుడికింది బంగ్లాదేశ్. రోజుల తరబడి ఇవి కొనసాగుతూ వచ్చాయి. భారత్ సహా ఇతర దేశాలు బంగ్లాదేశ్ ప్రభుత్వంపై అన్ని రకాలుగా ఒత్తిళ్లు తీసుకొస్తోన్నప్పటికీ- దీనికి మాత్రం చాలాకాలం పాటు బ్రేకులు పడలేదు.గత ఏడాది ఆగస్టు 5వ తేదీన ప్రధానమంత్రి షేక్ హసీనా సారథ్యంలోని ప్రభుత్వం కుప్పకూలిన విషయం తెలిసిందే. అప్పటి నుంచీ బంగ్లాదేశ్‌లో అమానుష ఘటనలు చోటు చేసుకుంటూ వచ్చాయి. ప్రత్యేకించి- హిందువులపై విపరీతంగా దాడులు కొనసాగాయి. దోపిడీలు, గృహ దహనాలు నిత్యకృత్యం అయ్యాయి.హిందువులతో పాటు ఇతర మైనారిటీలపై ఇస్లామిక్ మతఛాందసవాదులు విరుచుకుపడ్డారు. హైందవ ఆలయాలను ధ్వంసం చేయడం, భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న విగ్రహాలను పగులగొట్టడం, మంటల్లో పడేయడం, తగులబెట్టడం రోజువారీ కార్యక్రమంగా మారిందక్కడ. మహ్మద్ యూసుస్ సారథ్యంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఎలాంటి ఫలితమూ కనిపించలేదు అప్పట్లో.ఇస్కాన్ ప్రతినిధి, బంగ్లాదేశ్ సమ్మిళిత్ సనాతన్ జాగరణ్ జోటె నాయకుడు చిన్మయ్ కృష్ణ దాస్‌ను అరెస్ట్ చేయడం దీనికి పరాకాష్ఠగా మారింది. తమ దేశ జాతీయ పతాకాన్ని అవమానపరిచారనే కారణంతో గత ఏడాది నవంబర్ 25వ తేదీన ఆయన అరెస్ట్ అయ్యారు. ఢాకా చిత్తోగ్రామ్‌లోని హజ్రత్ షాజలాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.చిన్మయ్ కృష్ణ దాస్‌ను వెంటనే విడుదల చేయాలని, హిందువులపై దాడులను అడ్డుకునేలా బంగ్లాదేశ్ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికల ద్వారా ఒత్తిడిని తీసుకుని రావాలంటూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సైతం కేంద్రానికి డిమాండ్ చేసింది. అయినప్పటికీ ఎలాంటి ఉపయోగం ఉండట్లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీన ఆయనకు బెయిల్ లభించినప్పటికీ- రెండు రోజుల్లో మళ్లీ అరెస్ట్ అయ్యారు.ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని భారత్- తాజాగా పలు నిర్ణయాలు తీసుకుంది. ఆ దేశం నుంచి దిగుమతి చేసుకునే పలు రకాల వస్తువులు, ఆహార పదార్థాలపై ఆంక్షలు విధించింది. రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు సహా పలు



వస్తువులను బంగ్లాదేశ్ నుండి దిగుమతి చేసుకోవడంపై పోర్ట్ పరిమితులను విధించింది.ఈ ఆంక్షలు భారత్ గుండా నేపాల్, భూటాన్‌లకు రవాణా అయ్యే బంగ్లాదేశ్ వస్తువులకు వర్తించవు. అవి యధాతథంగా కొనసాగుతాయి. భారత్ లో దిగుమతులపై మాత్రమే ఈ పోర్ట్ ఆంక్షలు విధించింది కేంద్రం. బంగ్లాదేశ్ నుండి రెడీమేడ్ వస్త్రాల దిగుమతులను ఏ ల్యాండ్ పోర్టు నుండి అనుమతించబోమని ఉత్తర్వులో పేర్కొంది.

balagamtv100@gmail.com

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన నివారణ చర్యలు చేపట్టాలి

- ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రై డే పాటించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల: రాబోయే వానాకాలంలో మన జిల్లాలో డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ (సీజనల్ వ్యాధులు) ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని, సన్నిద్ధముగా ఉండాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాబోయే వర్షాకాలం సీజ న్ సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై పీపీటీ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులో మీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాలని , అక్కడ నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జ్వరాలు వచ్చాక ఇబ్బంది పడే కన్నా ముందుగా నియంత్రణ చర్యలు చేపట్టి రాకుండా చూసుకోవడం ఉత్తమము అనిఅన్నారు. ఇండ్లలో ఉన్న నీటి నిల్వలను గుర్తించి మాపింగ్ చేయాలని, అనంతరం అక్కడ నీరు నిల్వ ఉండకు ండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని,ప్రతి మంగళ/ శు క్రవారాలలో డ్రైడే కార్యక్రమంలోవాటర్‌లాగిన్‌పాయింట్ల మరమ్మత్తుకు గ్రామీణ ఉపాధి హామీ నిధులు వినియోగించుకొని పనులు చేపట్టాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో,పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాలచే అవసరమైన మేర ఆయిల్ బాల్ తయారుచేసి సన్నద్ధం కావాలని అన్నారు.జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అక్కడ అధికంగా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అధికారులు గ్రామాలను సందర్శించాలని అన్నారు. ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత , దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ సభలలో సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించాలని అన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని, వైద్య సేవలు మరియు అనుమానితులనుండి రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించాలని అన్నారు.జిల్లాలో ఉన్న ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూ రాపిడ్ టెస్ట్ లు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.ప్రతి మంగళవారం మరియు శుక్రవారం డ్రై డే కార్యక్రమం కింద నిల్వ ఉన్న నీరు తొలగించాలని, ఇంటిలో నీరు నిల్వ ఉంచుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత, జిల్లా పంచాయతీ అధికారి శరీఫుద్దీన్, ఎం.పీ.వో.లు, పంచాయతీ సెక్రటరీలు సంబంధిత వైద్య అధికారులు సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## అమెరికా సుప్రీంకోర్టు తీర్పును ఖండించిన ట్రంప్..

న్యూఢిల్లీ, మే 17: వెనెజులా నుంచి అమెరికా కు వలసొచ్చిన వారి బహి ష్కరణకు సంబంధించిన కేసులో అక్కడి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. దేశంలో అక్రమంగా ఉంటున్న వెనెజులా గ్యాంగ్‌ను బహిష్కరించడం కోసం ట్రంప్ చేస్తున్న ప్రయ త్నాలకు సుప్రీంకోర్టు అడ్డుతగలడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్ వేదికగా ఒక పోస్టు పెట్టారు.'మన దేశంలోకి అక్రమంగా వచ్చిన వాళ్లను బలవంతంగా పంపడాన్ని అనుమతించబోమని సుప్రీంకోర్టు ఇప్పుడే తీర్పు చెప్పింది. వలసొచ్చిన వాళ్లలో అనేకమంది హంతకులు, మాదక ద్రవ్యాల వ్యాపారులు, నేరస్థులు ఉన్నారు. సుప్రీం తీర్పు నేపథ్యంలో వారిని చట్టబద్ధంగా దేశం నుంచి పంపించేందుకు చాలా సంవత్సరాలు పడుతుంది. ఈలోగా వాళ్లు దేశంలో అనేక నేరాలకు పాల్పడుతారు. ఇది అమెరికన్లకు హాని చేస్తుంది. కోర్టు తీర్పు మరింత మంది నేరస్థులు మన దేశంలోకి అక్రమంగా ప్రవేశించడాన్ని ప్రోత్సహిస్తుంది. వారు ఇక్కడికి వచ్చి విధ్వంసం సృష్టిస్తారు. గత అధ్యక్షుడు జో బైడెన్ లక్షలాది మంది క్రిమినల్స్ అక్రమంగా మన దేశంలోకి రావడానికి అనుమతిం చారు. వాళ్లను బయటకు పంపించేందుకు మాత్రం మనం సుదీర్ఘమైన చట్టబద్ధమైన ప్రక్రియను అనుస రించాలి. మన దేశాన్ని రక్షించడానికి ప్రయత్నించిన జస్టిస్ అలిటో, జస్టిస్ థామస్‌లకు కృతజ్ఞతలు. ఇది అమెరికాకు ప్రమాదకరమైన రోజు'అని ట్రంప్ పేర్కొన్నారు.కాగా 1798 నాటి ఏలియన్ ఎనిమీస్ యాక్ట్‌ను వినియోగించి అమెరికాలో ఉంటున్న వెనెజులాకు చెందిన గ్యాంగ్‌ను బహిష్కరించాలని ట్రంప్ ప్రయత్నిం చారు. ఈ చర్యలకు అక్కడి సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. వారి బహిష్క రణను చట్టబద్ధంగా సవాల్ చేయడానికి వారికి తగినంత సమయం ఇవ్వాలనిసుప్రీం తీర్పునిచ్చింది. దీనిపైనే ట్రంప్ తాజాగా స్పందించారు.

## రాజీవ్ యువ వికాసం పథకం.. సిబిల్ స్కోర్ రూల్ ఉందా..? లేదా..?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత కు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడం కోసం రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని మార్చి 17న అసెంబ్లీ ప్రాంగణంలో ప్రారంభించింది.రాష్ట్రంలోని నిరుద్యోగులు మార్చి 17 నుంచి ఏప్రిల్ 5 వరకు రాజీవ్ యవ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం గడువు నిర్దేశించింది. గడువు పూర్తి అయింది కాబట్టి.. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు వచ్చిన అప్లికేషన్లను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ మొదలు పెట్టింది.ఈ ఎంపిక ప్రక్రియలో దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్దిదారులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అయిన జూన్ 2 న రుణాలు మంజూరు చేయనుంది రాష్ట్ర ప్రభుత్వం. ఎంపిక చేసిన 5 లక్షల మంది యువతకు రూ 6 వేల కోట్లు ఇవ్వనున్నట్లు రేవంత్ సర్కార్ పేర్కొంది. ఈ స్కీమ్ కింద కేటగిరీల వారీగా రాయితీ అందుతుంది. రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉంది.అయితే రాజీవ్ యవ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న యువత ఇప్పుడు ఆందోళనలో ఉన్నారు. రుణాలు మంజూరు కావడానికి సిబిల్ స్కోర్ నిబంధన విధించడంతో అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు. సిబిల్ స్కోర్ 700 పైగా ఉండాలి అనే రూల్ మళ్లీ తెరపైకి రావడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇక చాలా మంది పేద కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఈ రేంజ్ సిబిల్ స్కోర్ ఉండకపోవచ్చు. బ్యాంక్ లో జరిపిన లావాదేవీలు, గత రుణాల చెల్లింపుల ఆధారంగా బ్యాంకర్లు.. అభ్యర్థుల సిబిల్ స్కోర్‌ను పాన్ కార్డు ద్వారా సేకరిస్తున్నారు.ఇదే విషయంపై ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం స్కీం లబ్ధిదారుల ఎంపికలో సిబిల్ స్కోర్ ను ప్రాధాన్యంగా తీసుకుంటారన్న వార్తలను ఆయన తప్పుబట్టారు. ఆ వార్తలు నిజం కాదని.. అందులో వాస్తవం లేదని అన్నారు. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని భట్టి క్లారిటీ ఇచ్చారు. దీంతో దరఖాస్తుదారులు ఊపిరి పీల్చుకున్నారు.కానీ మళ్లీ సిబిల్ స్కోర్ వివాదం తాజాగా తెరమీదకు వచ్చింది. దీంతో ఈ విషయంపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. అయితే జూన్ 2 లోపు దీనిపై ప్రభుత్వం నుంచి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమాన, జైలు తప్పదు...

- ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.
- ఎస్పీ మహేష్ బి.గితే



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:
మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణం అయితే అట్టి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని,జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డ్రంక్అండ్ డ్రైవ్‌టెస్ట్‌లు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్ బి.గితే శనివారం ఓ ప్రక టనలో తెలిపారు.ఈ సందర్బంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ తరచు డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని ఆ యొక్క లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారస్సు చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు,ట్రాఫిక్ నిబంధనలు,రోడ్డు అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అలాగే మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే వారి తల్లదండ్రులకు బాధ్యత వహించాలనీ హెచ్చరించారు. తాగి వాహనాలు నడపవద్దని,పట్టుబడిన వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తూ కోర్టులో హాజరు చేయడం జరుగుతుందని,మద్యం సేవించి మొదటిసారి పట్టుబడిన రెండవసారి పట్టుబడిన వారు సేవించిన మద్యం మోతాదులను బట్టి తప్ప నిసరిగా శిక్షలు విధించబడతాయని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణపైన,మద్యం తాగివాహనాలు నడిపేవారిపైన కఠినంగా వ్యవహరించడమే కాకుండా వారికి నిరంతరం కౌన్సిలింగ్‌లు ఇవ్వడం,సూచనలు చేయడం అంతే కాక పాఠశాలలకు,కళాశాలలకు వెళ్లి విద్యార్థులతో మమేకమై పాటించాల్సిన నియమాలు వివరించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారని అన్నారు.

## కాంగ్రెస్ పంపిన జాబితాలో పేరు లేకున్నా.. శశిథరూర్‌ను ఎంపిక చేసిన కేంద్రం



న్యూఢిల్లీ, మే 17:పాకిస్థాన్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను కేంద్రం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రతినిధుల బృందాలకు నాయక త్వం వహించే ఏడుగురు వివిధ రాజకీయ పార్టీల ఎంపీల పేర్లను శనివారం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కోరిక మేరకు ఆయా పార్టీలు తమ నేతల పేర్లను ప్రభుత్వానికి పంపారు.అయితే, కాంగ్రెస్ పంపిన లిస్ట్‌లో శశిథరూర్ పేరు లేకపోయినా అనూహ్యంగా ఆయనను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా తెలిపారు. నిన్న ఉదయం (మే 16) పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌తో మాట్లాడినట్లు చెప్పారు. పాక్ ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రపంచదేశాలకు వివరించేందుకు విదేశాలకు పంపే ప్రతినిధుల బృందాలకు నలుగురు ఎంపీల పేర్లను ప్రతిపాదించాలని కోరినట్లు చెప్పారు. ఆయన విజ్ఞప్తి మేరకు నిన్న మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ ఆనంద్ శర్మ, గౌరవ్ గొగోయ్, డాక్టర్ సయ్యద్ నసీర్ హుస్సేన్, రాజ బ్రార్ పేర్లను పంపినట్లు చెప్పారు. కాంగ్రెస్ పంపిన ప్రతిపాదనలో థరూర్ పేరు లేదని వెల్లడించారు. అయితే, కేంద్రం అనూహ్యంగా ఆయన్ని ఎంపిక చేసిందంటూ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.

## భారత్ దెబ్బ.. కుప్పకూలిన టర్కీ ఆర్థిక వ్యవస్థ..

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానించాయి. అంతేకాక పకడ్బందీగా అమలు చేశాయి. అటు భారత్ ఉత్పత్తులను కూడా టర్కీకు ఎగుమతి చేయకుండా నిలిపివేశాయి. ఈ క్రమంలో టర్కీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దీంతో బాయికాట్ టర్కీ ప్రారంభించిన రెండు రోజులకే టర్కీ ఆర్థిక వ్యవస్థ భారీగా పతనమైనట్లు వార్తలు వస్తున్నాయి.అంతేకాక మేకిన్ ఇండియా, ఏవియేషన్, మెట్రో రైలు.. తదితర రంగాల్లో టర్కీకి చెందిన పలు కంపెనీలు పనిచేస్తున్నాయి. ఇప్పుడు వీటన్నింటినీ రద్దు చేసేందుకు భారత్ సిద్ధమైంది. దీంతో టర్కీ తలపట్టుకుంది. పాకిస్థాన్ కు సాయం చేసి పెద్ద తప్పు చేశామని అనుకుంటోంది. అంతేకాక టర్కీ బ్రాండ్లను సైతం నిషేధించాలంటూ దేశవ్యాప్తంగా ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో టర్కీ తయారుచేసే వస్త్రాలను ప్రముఖ రిటైల్ సంస్థలు నిలిపివేశాయి. ఇది టర్కీ ఆర్థిక వ్యవస్థకు బిగ్ షాక్ అని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## కాళేశ్వరంలో గాలి వాన బీభత్సం..

### సరస్వతి పుష్కరఘాట్ అస్తవ్యస్తం



మహాదేవపూర్( కాళేశ్వరం) మే 17: కాళేశ్వరంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. వర్షం కారణంగా వీఐపీ ఘాట్, ఆలయ పరిస రాలు అస్తవ్యస్తంగా మారాయి. భారీ ఈదురుగాలులకు అక్కడక్కడ ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు చినిగి రోడ్డుపై పడ్డాయి. రహదారులు బురదమయం అవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బ ందులు పడుతున్నారు.గాలివాన బీభత్సానికి పుష్కరా ల సందర్భంగా ఏర్పాటు చేసిన టెంట్లు, చలువ పందిళ్లు నేలకూలాయి. వీఐపీ ఘాట్ వద్ద లైటింగ్, స్వాగత తోరణాలు దెబ్బతిన్నాయి. దీంతో సిబ్బంది వాటికి మరమ్మతులు చేశారు. పుష్కరఘాట్ వద్ద కూలిన చలువ పంది ళ్లను తొలగించారు.పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతున్నది. మూడో రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు రలివచ్చారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు.

## కేంద్రం సంచలన నిర్ణయం

### భారత ఆర్మీకి ఎమర్జెన్సీ పవర్స్: రూ.40,000 కోట్లు




న్యూఢిల్లీ, మే 17:జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదుల అమానుష దాడికి ప్రతీకారంగా భారత్.. పాకిస్తాన్ పై యుద్ధానికి దిగిన విధానం, ఆ సమయంలో వ్యవహరించిన తీరు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనలతో దాడులను విరమించు కోవడం.. విమర్శలకు దారి తీస్తోంది. కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల అభ్యంతరాలూ వ్యక్తమౌతో న్నాయి. అదే సమయంలో పాకిస్తాన్ సైన్యం సైతం దాడులకు దిగింది. డ్రోన్లు, మిస్సైళ్లు, మోర్టార్ షెల్స్ తో కాల్పులు జరిపింది. దీన్ని భారత్ సమర్థవంతంగా అడ్డుకుంది. ప్రతిదాడులతో శత్రుదేశాన్ని ఉక్కిరిబిక్కిరికి గురి చేసింది. ఇది మరింత తీవ్రతరమౌతుందనుకున్న దశలో డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకున్నారు. ఆయన సూచనలతో భారత్- పాక్ కాల్పుల విరమణ ప్రకటించాయి. ఆపరేషన్ సింధూర్ కు తాత్కాలికంగా మాత్రమే బ్రేక్ పడిందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. పాకిస్తాన్ ఎప్పుడు తోక ఝాడించినా మలిదశ దాడులు ఉంటాయంటూ హెచ్చరించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాద దాడులు జరిగితే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందనీ స్పష్టం చేశారు. ఈ పరిణామాల మధ్య కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. ఆయు ధాలు, మందుగుండు, ఇతర డిఫెన్స్ పరికరాలను కొనుగోలు చేయడానికి ఆర్మీకి అత్యవసర అధికారాలను అప్పగించింది. దీనికోసం దాదాపు 40,000 కోట్ల రూపాయలను కేటాయించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది .

## అధ్వాన్నంగా మారిన బతుకమ్మకుంట-తిలక్‌నగర్ చౌరస్తా రహదారి

అంబర్‌పేట, మే 17 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మ కుంట తిలక్‌నగర్ చౌరస్తాకు వెళ్లే రహదారి అధ్వాన్నంగా మారింది. పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా తయారైంది. రాత్రిపూట వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. అయినా ఈ రోడ్డును బాగుచేయాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బతుకమ్మకుంట నుంచి తిలక్‌నగర్ చౌరస్తాకు వెళ్లే దారిలో కొన్ని నెలల క్రితం కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ ను ఏర్పాటు చేశారు. పనులు పూర్తయిన తర్వాత వాటర్‌వర్క్స్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ తూతూమంత్రంగా ప్యాచ్‌వర్క్ చేసి చేతులు దులుపుకున్నారు. కొద్ది రోజులు గడిచింది. ఇటీవల హైడ్రా ద్వారా బతుకమ్మకుంట డెవలప్‌మెంట్ పనులు మొదలయ్యాయి. కుంటలో ఉన్న మట్టిని తవ్వి పెద్ద పెద్ద లారీల ద్వారా బయటకు పంపిస్తున్నారు. ఆ లారీలన్నీ ఈ రోడ్డు మీద నుంచే వెళ్తున్నాయి. అవి భారీ బరువు ఉండడంతో వాటర్‌వర్క్స్ అధికారులు చేసిన రోడ్డు ప్యాచ్‌వర్క్ పూర్తిగా తొలగిపోయి గుంతలుగా మారింది. పైప్‌లైన్ వేసిన చోట కిందకు కుంగిపోయింది. దీంతో గత పదిహేను రోజులుగా ఈ రోడ్డుపై వెళ్లాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. ఒక్కోసారి వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో స్లిప్ అయి కిందపడిపోతున్నాయి. వాహనదారులకు దెబ్బలు తగులుతున్నాయి. ఇదిలా ఉండగా భారీ వాహనాలు వెళ్తుండడంతో ట్రాఫిక్ జామ్ కూడా అవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రోడ్డుకు సరైన ప్యాచ్‌వర్క్ చేసి వాహనదారులు బాధలు తొలగించాలని కోరుతున్నారు.

## ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణ ముహూర్తం ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)..

అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. కాగా, రాజగోపాల్ తో పాటుగా వివేక్ కు పార్టీలో చేరే సమయంలోనే హామీ ఇచ్చిన విషయాన్ని నేతలు గుర్తు చేసారు. వారికి చాన్స్ నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి పేరు ఖాయంగా కనిపిస్తోంది.అదిలాబాద్ నుంచి గడ్డం వినోద్ కు మంత్రి పదవి ఇస్తారనే ప్రచారం సాగుతోంది.
మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సైతం మంత్రి పదవి పైన ఆశలు పెట్టుకున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండటంతో.. రాజ గోపాల్ కు ఇప్పడే ఛాన్స్ ఇస్తారా లేదా అనేది చూడాలి. రంగారెడ్డి నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిలో ఒకరికి మంత్రి పదవి ఖాయమని చెబుతున్నారు. ముదిరాజ్ వర్గానికి మంత్ రివర్గంలో అవకాశం ఇస్తే మహబూబ్ నగర్ కు చెందిన శ్రీహరి పేరు రేసులో ఉంది. ఇక..సీఎం వద్ద పలు కీలక శాఖలు ఉన్నాయి. విద్య, హెూం, గనులు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక శాఖలు ఉన్నాయి. దీంతో..కొత్తగా వచ్చే వారికి ఈ శాఖలు కేటాయిస్తారనే అంచనాలు ఉన్నా...ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొందరి శాఖల సర్దుబాటు ఉంటుందనే వాదన కాంగ్రెస్ నేతల్లో వినిపిస్తోంది.


## ప్రతి స్కూల్, కాలేజీ బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్ తప్పనిసరి :

### ఈస్ట్ జోన్ ఆర్టీవో



హైదరాబాద్-మే 17 : ఆర్టీఏ నిబంధనల ప్రకారం ప్రతి స్కూల్, కాలేజ్ బస్సుకు ఫిట్‌నెస్ టెస్టు తప్పనిసరి అని ఈస్ట్ జోన్ ఆర్టీవో ఎల్. కిష్టయ్య తెలిపారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, కార్యదర్శి సి. రమేష్ ఆదేశాల మేరకు మలక్‌పేట్ ఆర్టీవో ఎల్. కిష్టయ్య ఆధ్వర్యంలో ఆర్టీఏ ఈస్ట్ జోన్ నాగోల్ కార్యాలయం ప్రాంగణంలో శనివారం స్కూల్, కాలేజ్ బస్సుల యా జమాన్యం, డ్రైవర్లకు బస్సు ఫిట్‌నెస్ నిబంధనలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో కిష్టయ్య మాట్లాడుతూ.. ప్రతి స్కూలు, కాలేజీ బస్సులను ఫిట్‌నెస్‌గా ఉంచుకోవడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బస్సులను నడపాలని.. అతివేగంతో నడిపి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో ఆర్టీఏ ఈస్ట్ జోన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు ఎం. బలరాం, ఆర్. రమేష్ బాబు, ఆర్. నరేందర్ పాల్ సింగ్, ఆర్. రాధిక పాల్గొన్నారు.

## భారత్-పాకిస్థాన్ దేశాలు మళ్లీ శాంతి చర్చలు జరుపాలి : రష్యా



హైదరాబాద్-మే 17 : భారత్-పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై ఆ రెండు దేశాలు పరస్పర చర్చలు జరుపాలని ఇప్పటికే అమెరికా , చైనా భారత్‌కు సూచిం చాయి. తాజాగా రష్యా కూడా ఆ జాబితాలో చేరింది. 'ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలపై భారత్, పాకిస్థాన్ ప్రత్యక్ష శాంతి ఒప్పంద చర్చలు జర పాలని ఆశిస్తున్నాం. ఈ విషయంలో ఇరుదేశాలు పరస్పర విశ్వాసంతో ముం దుకు వెళ్లాలని కోరుకుంటున్నాం' అని రష్యన్ ఫెడరేషన్ విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగు తోంది. ఈ నేపథ్యంలో అమెరికా స్పందిస్తూ.. భారత్, పాక్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతించింది. రెండు దేశాల మధ్య సం ఘర్షణ నివారణకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించింది. రెండు దేశాలు శాంతి మార్గాన్ని ఎంచుకోవడాన్ని అభినందిస్తున్నామని వ్యాఖ్యానించింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగినప్పుడు తమ మద్దతు పాక్‌కే అని తెగేసి చెప్పిన చైనా.. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణను మాత్రం సమర్థిస్తున్నట్లు పేర్కొంది. చర్చలు, సంప్రదింపుల ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించింది. ఇదిలావుంటే భారత్‌తో చర్చలకు పాక్ సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే కశ్మీర్ అంశం కూడా చర్చల్లో చేర్చాలనేది తమ షరతు అని పేర్కొంది.

## చార్జీల పెంపు.. మోయలేని భారం

### ఒక్కో ప్రయాణికుడిపై నెలకు 600 పైగా అధిక భారం

### వసతులేమో అధ్వానం.. ప్యాసింజర్ల ఆగ్రహం

హైదరాబాద్-మే 17 : మెట్రో టికెట్ ధరల పెంపు ఇప్పుడు సామాన్యుడికి భారంగా మారుతోంది. నిత్యం దూర ప్రాంతాల మధ్య రాకపోకలు చేసేవారిపై ఏకంగా రూ. 15 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. అయితే ధరల పెంపుపై ఇప్పటికే ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తుండగా.. ఇదే సమయంలో మెట్రో నిర్వహణపై ఇకనైనా దృష్టి పెట్టాలంటూ చురకలు అంటిస్తున్నారు. నిత్యం 4.5లక్షల మంది ప్రయాణిస్తున్నా.. ఇప్పటికీ కొత్త బోగీలను ఏర్పాటు చేయకపోవడంతో.. పీక్ అవర్స్‌లో జనాల మధ్య నలిగిపోవాల్సి వస్తున్నదని, అసలే పని ఒత్తిడిలో ఉండేవాళ్లకు ఇదొక అదనపు సమస్యనే అవుతుందని, కనీసం నిలబడేంత స్థలం కూడా లేకపోవడంతో.. ప్రయాణం భారమైపోతుందని వాపోతున్నారు.

## పాక్ శాంతి మంత్రం!

### చర్చలతోనే సమస్య పరిష్కారమన్న ప్రధాని షరీఫ్

### ఉగ్రవాద నిరోధానికి సహాయ పడతామని వెల్లడి



ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రధాని హెహబాజ్ షరీఫ్ శాంతి మంత్రం పఠించారు. చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుందని కొత్త పల్లవి అందుకున్నారు. రెండు దేశాల మధ్య మూడుసార్లు యుద్ధం జరిగినా సాధించినదేమీ లేదంటూ వైరాగ్యాన్ని ప్రదర్శించారు. శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 'మన సమస్యలు పరిష్కారం కాకుండా జమ్ముకశ్మీర్‌లో శాంతి సాధ్యపడదు' అని స్పష్టం చేశారు. ఎయిర్ బేస్ విధ్వంసం నిజమేభారత్-పాకిస్థాన్ యుద్ధంలో తమ దేశంపై భారత్ బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించిన విషయం సాక్షాత్తూ ఆ దేశమే నిర్ధారించింది. తమ నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్, దేశంలోని ఇతర ప్రదేశాలు లక్ష్యంగా భారత్ బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించి ధ్వంసం చేసిందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. ఈ సందర్భంగా ఆ రోజు జరిగిన ఘటనలను గుర్తుకు తెచ్చుకున్నారు.

# పెంచిన మెట్రో చార్జీలు రద్దు చేయాలి..

# వామపక్ష పార్టీల ధర్నా




హైదరాబాద్-మే 17 : పెంచిన మెట్రో చార్జీలు రద్దు చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు హైదరాబాద్ నాగోలులోని మెట్రో ప్రధాన కార్యాలయం ముందు సీసీఎం, సీపీఐ, సీపీఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ, ఎస్‌యూసీఐ, ఎంసీపీఐ పార్టీలు సంయుక్తంగా ధర్నా నిర్వహించాయి. మెట్రో నష్టాలకు యాజమాన్య తీరే కారణ మని ఆయా పార్టీ నాయకులు ఆరోపించారు. నష్టాలను తగ్గించేం దుకు ప్రత్యామయ మార్గాలు చూసుకోవాలని సూచించారు. చార్జీల పెంపును రద్దు చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఏం చేస్తు న్నాయని ప్రశ్నించారు. ధర్నా అనంతరం పెంచిన మెట్రో చార్జీలను తగ్గించాలంటూ ఎల్‌అండ్‌టీ యాజమాన్యానికి వామపక్ష పార్టీల తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం హైదరా బాద్ సెంట్రల్ కార్యదర్శి ఎం వెంకటేశ్, సీపీఎం మేడ్చల్ మల్కా జిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. ఎల్‌అండ్‌టీ యాజ మాన్యం మెట్రో ఛార్జీలు పెంచడం సరైనది కాదని అన్నారు. వెంటనే పెంచిన చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో ఎల్‌అండ్‌టీ యాజమాన్యానికి జరిగిన ఒప్పందానికి భిన్నంగా ఇప్పటికే చార్జీలు పెంచి ప్రయాణికుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారని, ఇప్పుడు మళ్లీ చార్జీలు పెంచడమేంటని మండిపడ్డారు. రైల్వే నిర్వహణ ఖర్చు సగం ప్రయాణికుల నుంచి, మిగిలిన సగం రియల్ ఎస్టేట్, యాడ్స్ ఇతరత్రా రిటైల్ వ్యాపారాల ద్వారా సమకూ ర్చుకోవాలని ప్రభుత్వంతో ఎల్‌అండ్‌టీ యాజమాన్యానికి జరిగిన ఒప్పందంలోఉందని తెలిపారు. కానీ దానికి భిన్నంగా చార్జీలు పెంచడం సరైనది కాదని అన్నారు. మెట్రో నష్టాల్లో ఉందని చార్జీలు పెంచాలని ఫెయిర్ ఫిక్సేషన్ కమిటీ సిఫార్సు చేసిందని వారు గుర్తు చేశారు. మెట్రో నష్టాలకు ఎల్‌అండ్‌టీ యాజమాన్యమే కారణమని తెలిపారు. రోజు ఐదు లక్షల మంది ప్రయాణికుల చార్జీల ద్వారా సంవత్సరానికి 650 కోట్లు వస్తుంటే యాడ్స్ ఇతర వనరుల ద్వారా 250 కోట్లు మాత్రమే మెట్రో ఆదాయం వస్తుందని అన్నారు. ప్రభు త్వం ఇచ్చిన 269 ఎకరాల భూమిని సద్వినియోగం చేసుకోక, తమనష్టాలు తీర్చుకోవడానికి ఇతర వనరులు పెంచుకోలేక ప్రయా ణికులపై భారం మోపడం సరైనది కాదని హితవుపలికారు. దేశం లోనే చార్జీలు ఎక్కువగా ఉన్న మెట్రో సర్వీస్ హైదరాబాద్, తిరిగి ఇప్పుడు పెంచడం ప్రజలపై మరింత భారం పడుతుంది అని తెలిపారు. ఎల్‌అండ్‌టీ యాజ మాన్యం ఏకపక్షంగా మెట్రో చార్జీలను పెం చిందా? లేదా దీనిలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పాత్ర ఉందా? ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో భారీ చోరీ... 75 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు మాయం !



హైదరాబాద్-మే 17 :హైదరాబాద్ నగరంలోని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న భారీ చోరీ స్థానికులను షాక్‌కు గురి చేసింది. ఫహీముద్దీన్ అనే వ్యాపారి ఇంట్లో దుండగులు హత్తుకున్న స్వర్ణాభరణాలతో పాటు లక్షల రూపాయల నగదును అపహరించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనలో 75 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.5 లక్షల నగదును అపహరించారని తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. వ్యాపారవేత్త ఫహీముద్దీన్ భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో శుక్రవారం రాత్రి ఫహీముద్దీన్ తన తల్లిదండ్రులను ఇంట్లో వదిలి ఆసుపత్రికి వెళ్లారు. ఇదే అవకాశంగా భావించిన దుండగులు ఇంటి వెనుక భాగంలో గోడ దాటి లోపలికి ప్రవేశించారు. ఇంట్లోకి చొరబడిన దొంగలు అత్యంత చాకచక్యంతో వ్యవహరించారని పోలీసులు చెబుతున్నారు. ఫహీముద్దీన్ తల్లిదండ్రులు నిద్రిస్తున్న గదికి బయట నుంచి గొళ్లెం పెట్టి తాళం వేసి చుట్టుపక్కల ఎవరూ గుర్తించకుండా జాగ్రత్తగా పని కానిచ్చినట్టు భావిస్తున్నారు. అంతేకాకుండా, చోరీ చేసేముందు ఫ్రిజ్‌లో ఉన్న పండ్లు తిన్నట్లుగా పోలీసులు గుర్తించారు. అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువాను పగులగొట్టి అందులో దాచిన 75 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.5 లక్షల నగదును అపహరించారు. బంగారం మాత్రమే కాకుండా, కొన్ని విలువైన డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా మాయం చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. తెల్లవారుజామున ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన ఫహీముద్దీన్ చోరీ జరిగిన విషయాన్ని గమనించి వెంటనే చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌ను రప్పించి ఫింగర్‌ప్రింట్లు సేకరించారు. ఇంటి చుట్టూ ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. చోరీకి ముందుగానే ఇంటిని గమనించి పక్కా ప్లాన్‌తో దొంగతనం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. స్థానిక చుట్టుపక్కలున్న ఇతర ఇళ్లను కూడా అడిగి ప్రాథమిక సమాచారం సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేశారు. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామంటూ చాదర్‌ఘాట్ పోలీసులు వెల్లడించారు.

## కిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స.. అతిపెద్ద కణితిని తొలగించిన వైద్యులు



హైదరాబాద్-మే 17 : ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళకు కొండా పూర్ కిమ్స్ దవాఖాన వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి కాపాడారు. మియాపూర్‌కు చెందిన 35 ఏళ్ల మహిళకు గొంతు వద్ద థైరాయిడ్ వాపు కారణంగా.. గుండెను, ఊపిరితిత్తులను, ప్రధాన రక్తనాళాలను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుండటంతో ఇబ్బంది పడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉండగా.. ఆమెకు కిమ్స్ వైద్యులు చికిత్స చేసి నయం చేశారు. ఈ సందర్భంగా థోరాసిక్ సర్జన్, డాక్టర్ సీ రోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 35 ఏళ్ల వయసున్న ఆ మహిళ ఊపిరి అందక ఇబ్బంది పడుతూ ముందుగా వేరే దవాఖానకు వెళ్లగా అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు ఎదలో కుడివైపుపై భాగంలో ఒక భారీ కణతి కనిపించింది. బయాప్సీ పరీక్షలో భారీ థైరాయిడ్ కణంలా అనిపించడంతో ఆమెను కొండాపూర్‌లోని కిమ్స్ దవాఖానాకు పంపించారు. దీంతో అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు ఆమెకు చాలా కాలం నుంచి థైరాయిడ్ వాపు సమస్య ఉందని, క్రమంగా మెడ నుంచి కిందికి వెళ్లి ఎదభాగాన్ని ఆక్రమించిందని తెలిసింది.

## నిమ్స్ పనుల్లో వేగం పెంచాలి

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



హైదరాబాద్-మే 17 : నిమ్స్ విస్తరణ పనుల్లో పెంచి నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పంజాగుట్ట లోని నిమ్స్ దవాఖానలో విస్తరణ ప్రాజెక్టులో చేపట్టిన పనుల వివరాలు, పురోగతి, బ్లాక్ ల వారీగా జరుగుతున్న పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆర్ అండ్ బీ అధికారులు కలెక్టర్ కు వివరించారు. 19.54 ఎకరాలలో 26 ,19, 209 చదరపు అడుగుల విస్తీర్ణం లో రూ. 1698 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రాజెక్టులో ఇంతవరకు 35 శాతం పురోగతి సాధించగా 2026 డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురోగతిపై సీఎం ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారని అన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో కలసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి , సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఆర్ అండ్ బీ ఎస్‌సీ నర్సింగరావు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, మెగా డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈ ఈ విశ్వకుమార్ , డీఈ లు, ఖైరాతాబాద్ తహసీల్దార్ నాయిమొద్దీన్, డాక్టర్లు , ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో చార్జీల పెంపు వద్దు..

### రేవంత్‌కు నగర బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బహిరంగలేఖ



హైదరాబాద్ మే 17 : చార్జీల పెంపుతో నిత్యం మెట్రోలో ప్రయాణించే లక్షలాది ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రో, నిత్యావసరాల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో చార్జీలు పెంచి రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు వారిని మరింత ఆర్థిక కష్టాల్లోకి నెట్టడం బాధాకరమని వాపోయారు. టికెట్ రేట్లు రూ.10 నుంచి రూ.20 వరకు పెంచడంతో సామాన్య ప్రయాణికుడిపై ప్రతి నెల సగటున రూ.500 నుంచి రూ.600 వరకు భారం పడుతుందని వాపోయారు. ప్రజలకు చవకైన, వేగవంతమైన, నమ్మకమైన సేవలందించాల్సిన ప్రజారవాణా వ్యవస్థల ప్రాథమిక లక్ష్యాన్ని నీరుగార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంతర్జాతీయ నగరాలైన సింగపూర్, బెర్లిన్, టోక్యోల్లో ప్రభుత్వ సబ్సిడీలతో ప్రజా రవాణా వ్యవస్థలు నడుస్తున్నాయని గుర్తుచేశారు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని చూస్తుంటే ప్రజారవాణాపై పగబట్టినట్టు స్పష్టమవుతున్నదని విమర్శించారు. విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్న హైదరాబాద్‌లో ప్రజారవాణాను మరింత బలోపేతం చేయాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ మెట్రో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలి తప్ప ప్రైవేట్ కంపెనీల లాభాల కోసం కాదనే విషయాన్ని సర్కారు గుర్తించాలని సూ చించారు. చార్జీల పెంపు ద్వారా ఇన్నాళ్లుగా మెట్రో సేవలను ఉపయోగించుకుంటున్న లక్షలాది మంది ఉద్యోగు లు, యూనివర్సిటీ, కాలేజీల విద్యార్థులు ఇతర రవాణా మార్గాలకు మళ్లే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

## భారీగా తగ్గిన టీవీఎస్ ఐక్యూబ్ ధర..



న్యూఢిల్లీ, మే 17: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ కీలక నిర్ణయం తీసుకున్నది. తన ఎలక్ట్రిక్ స్కూటర్ మాడల్ ఐక్యూబ్ ధరను భారీగా తగ్గించింది. బ్యాటరీ కెపాసిటీని పెంచడంతోపాటు ధరను రూ.26 వేల వరకు దించింది. ఐక్యూబ్, ఐక్యూబ్ ఎస్ మాడళ్ల ధరలను రూ.16 వేలు తగ్గించిన సంస్థ..ఐక్యూబ్ ఎస్‌టీ మాడళ్లను రూ.26 వేలకు తగ్గించింది. దీంతో ఐక్యూబ్ స్కూటర్ ప్రారంభ ధర రూ.1.31 లక్షలకు దిగిరాగా, గరిష్ఠ ధర రూ.1.59 లక్షలకు తగ్గింది. ఈ ధరలు వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. అలాగే బ్యాటరీ కెపాసిటీని 3.4 కిలోవాట్ల నుంచి 3.5 కిలోవాట్లకు పెంచిన సంస్థ..మరో మాడల్‌ను 5.1 కిలోవాట్ల నుంచి 5.3 కిలోవాట్లకు పెంచింది. సింగిల్ చార్జింగ్‌తో ఐక్యూబ్ ఎస్ మాడల్ 145 కిలోమీటర్లు, ఐక్యూబ్ ఎస్‌టీ మాడల్ 212 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# నానిని ఊరిస్తున్న రేర్ రికార్డు..

## వసూళ్లతో కష్టమే, హిట్ 3కి ఎన్ని కోట్లంటే?



డాక్టర్ శైలేష్ కొలను సృష్టించిన హిట్ ఫ్రాంఛైజీలో భాగంగా తెరకెక్కిన మూడో చిత్రం హిట్ 3 : ది థర్డ్ కేస్ . నేచురల్ స్టార్ నాని, శ్రీనిధి శెట్టి జంటగా నటించారు. వాల్ పోస్టర్ సినిమా, యునాన్మిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై ప్రశాంతి త్రిపిర్నేని హిట్ 3ని నిర్మించారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా మూడో వారంలోకి అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో రెండు వారాల్లో ఈ సినిమాకు ఎన్ని కోట్ల కలెక్షన్స్ వచ్చాయి? ఏయే ఏరియాలలో హిట్ 3 బ్రేక్ ఈవెన్ అయ్యింది? 17వ రోజు నాని సినిమా ఏ ఏరియాలో ఎంత వసూలు చేసిందో... హిట్ 3 సినిమాకు దాదాపు రూ.60 కోట్ల బడ్జెట్‌తో నిర్మించగా.. డిజిటల్ రైట్స్‌ను నెట్‌ఫ్లిక్స్ 54 కోట్ల రూపాయలకు సొంతం చేసుకొన్నది. ఆడియో రైట్స్ 6 కోట్లు, శాటిలైట్ రైట్స్ కింద 12 కోట్ల మేర బిజినెస్ చేసినట్లు ట్రేడ్ పండితులు తెలిపారు. హిట్ 3కి ప్రపంచవ్యాప్తంగా 48.5 కోట్ల మేర థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. ఈ సినిమా లాభాల్లోకి రావాలంటే కనీసం 50 కోట్ల రూపాయల షేర్, 100 కోట్ల గ్రాస్ వసూళ్లు చేయాలని ట్రేడ్ పండితులు విలువ కట్టారు. మే 1న ఈ సినిమాను సుమారుగా 1000 స్క్రీన్లలో రిలీజ్ చేశారు. ఇండియాలో 16 రోజుల కలెక్షన్స్ ఎంతంటే? హిట్ 3కి తొలి రోజు భారత్‌లో రూ.21 కోట్ల నెట్, రెండో రోజు 10.5 కోట్ల నెట్, మూడో రోజు రూ.10.4 కోట్ల నెట్, నాలుగో రోజున రూ.10.25 కోట్ల నెట్, ఐదో రోజున రూ.3.65 కోట్ల నెట్, ఆరో రోజున రూ.3.25 కోట్ల నెట్, ఏడో రోజున రూ.2.35 కోట్ల నెట్, 8వ రోజున రూ.2.1 కోట్ల నెట్, 9వ రోజున రూ.2 కోట్ల నెట్, 10వ రోజున రూ. 3 కోట్ల నెట్, పదకొండవ రోజున రూ.2.28 కోట్లు, పన్నెండవ రోజున రూ.1.13 కోట్లు, పదమూడవ రోజున రూ.1.15 కోట్లు, 14వ రోజున కోటి రూపాయలు, 15వ రోజున రూ.85 లక్షలు, 16వ రోజున రూ.59 లక్షల నెట్ వచ్చింది. దీంతో 16 రోజుల వరకు ఇండియా వైడ్‌గా రూ.77 కోట్ల నికర వసూళ్లు సాధించింది హిట్ 3. తెలుగు రాష్ట్రాల్లో హిట్ 3 కలెక్షన్స్ ఆంధ్రా, తెలంగాణ వసూళ్ల విషయానికి వస్తే తొలి రోజు రూ.20.25 కోట్ల నెట్, రెండో రోజు రూ.10 కోట్ల నెట్, మూడో రోజు రూ.9.8 కోట్ల నెట్, నాలుగో రోజున రూ.9.4 కోట్ల నెట్, ఐదో రోజున రూ.3.3 కోట్ల నెట్ , ఆరో రోజున రూ.2.92 కోట్ల నెట్ , ఏడో రోజున రూ.2.1 కోట్ల నెట్, ఎనిమిదో రోజున రూ.2.03 కోట్ల నెట్, తొమ్మిదో రోజున రూ.1.83 కోట్లు, పదో రోజున రూ.2.55 కోట్లు, పదకొండవ రోజున రూ.2.20 కోట్లు, పన్నెండవ రోజున రూ.96 లక్షలు, పదమూడవ రోజున రూ.82 లక్షలు, పద్నాలగవ రోజున రూ.72 లక్షలు, పదిహేనవ రోజున రూ.64 లక్షలు, పదహారవ రోజున రూ.59 లక్షల నెట్ చొప్పున తెలుగు రాష్ట్రాల్లో నికరంగా 71 కోట్ల రూపాయలు రాబట్టాడు నాని. తమిళంలో రూ.1.74 కోట్ల నెట్, కన్నడంలో 49 లక్షల నెట్, హిందీలో రూ.3.48 కోట్ల నెట్, మలయాళంలో రూ.78 లక్షలు, ఓవర్సీస్‌లో రూ.24.7 కోట్ల కలెక్షన్స్ వచ్చినట్లు సాక్‌నిల్క్ తెలిపింది.

# అల్లు అర్జున్-అట్లీ మూవీ పట్టాలెక్కేది ఇంకెప్పుడు..?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రం 2024 డిసెంబర్ 4న రిలీజై బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. అయితే, ఈ సినిమా వచ్చి దాదాపు ఆరు నెలలు అయింది. బన్నీ తన నెక్స్ట్ ప్రాజెక్టును తమిళ దర్శకుడు అట్లీతో ఇప్పటికే అనౌన్స్ చేశాడు.కానీ, ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు స్టార్ట్ అవుతుంది..? ప్రస్తుతం బన్నీ ఫ్యాన్స్‌తో పాటు కామన్ ఆడియన్స్‌ను కూడా వేధిస్తున్న ప్రశ్న ఇది. పుష్ప చిత్ర ఫ్రాంచైజీ కోసం ఏకంగా 5 ఏళ్ల సమయం తీసుకున్న బన్నీ, తన లాస్ట్ మూవీ వచ్చి 6 నెలలు అవుతున్నా ఇంకా తన నెక్స్ట్ చిత్రాన్ని ప్రారంభించలేదు.దీంతో బన్నీ ఇకనైనా స్పీడ్ పెంచాలని.. మిగతా స్టార్ హీరోల మాదిరిగా ఆయన కూడా వరుస ప్రాజెక్టులు పట్టాలెక్కిస్తే బాగుంటుందని అభిమానులు భావిస్తున్నారు. మరి ఈ విషయంపై బన్నీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో చూడాలి.

# విశ్వంభర, రాజసాబ్ మౌనం వీడేది ఎప్పుడు?




ఈ ఏడాదిలో ఈపాటికే రావాల్సిన పలు భారీ చిత్రాల్లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన విశ్వంభర అలాగే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన ది రాజా సాబ్ సినిమాలు కూడా ఒకటి. అయితే ఎప్పుడో మొదలైన ఈ సినిమాలపై సరైన క్లారిటీ లేక ఫ్యాన్స్ కన్ఫ్యూజన్ లో ఉన్నారు. విశ్వంభర కొంచెం ఓకే కానీ రాజా సాబ్ విషయం లో అభిమానులకి ఆసక్తి తగ్గిపోతుంది.చిరు సినిమా నుంచి ఒక పాట అయినా వచ్చింది కానీ రాజా సాబ్ పై అనుకున్న అప్డేట్ కూడా రాలేదు. ఇంకోపక్క వీటి తోనే డీల్ అవుతూ వచ్చిన హరిహర వీరమల్లు ఫుల్ స్వింగ్ లో ఉంది. మెయిన్ గా విశ్వంభర, రాజా సాబ్ సినిమాలపై రిలీజ్ క్లారిటీ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు కానీ అవే పెద్ద సస్పెన్స్ గా ఉంచేశారు. మరి వీటిపై ఎప్పుడు క్లారిటీ వస్తుంది అనేది చూడాలి.

# మిషన్ ఇంపాసిబుల్ 2570 కోట్ల బడ్జెట్..

## ఇండియాలో టామ్ క్రూజ్ మూవీకి కలెక్షన్లు




ప్రపంచ సినిమా రంగంలో అత్యంత పాపులారిటీ ఉన్న ఫ్రాంచైజీలో మిషన్: ఇంపాసిబుల్ ఒకటి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సిరీస్‌లో భాగంగా ఇటీవల విడుదలైన 8వ చిత్రం మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకానింగ్. ఈ సినిమాకు సంబంధించిన పార్ట్ వన్ మూవీ 2023 సంవత్సరంలో రిలీజైంది. దానికి రెండో పార్ట్‌గా ప్రస్తుతం మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకానింగ్ మే 17 తేదీన ఇండియాలో గ్రాండ్‌గా రిలీజైంది. ఈ సినిమా అమెరికా, ఇతర దేశాల్లో మే 23వ తేదీన విడుదల కానున్నది. ఈ సినిమా ఇండియా కలెక్షన్లు, ఈ మూవీ బడ్జెట్ వివరాల్లోకి వెళితే..హాలీవుడ్ సూపర్ స్టార్ టామ్ క్రూజ్ నటించిన ఈ చిత్రంలో హేలీ ఎట్‌వెల్, వింగ్ రేమ్స్, సైమన్ పెగ్, ఇసాయి మోరేల్స్, పామ్ క్లెమెంటీఫ్, హెన్నీ జార్నీ తదితరులు నటించారు. ఈ చిత్రానికి క్రిస్టఫర్ మాక్క్వేరీ దర్వకత్వం వహించారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాను ప్రపంచంలోని పలు దేశాల్లో అందమైన పర్వత ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఈ సినిమాను సుమారుగా 300 మిలియన్ డాలర్లు అంటే.. భారతీయ కరెన్సీలో సుమారుగా 2570 కోట్ల రూపాయలతో నిర్మించారు.మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకానింగ్ సినిమాకు ఇండియాలో భారీ ఆదరణ కనిపించింది. శనివారం రోజున రిలీజైన ఈ సినిమాకు వీకెండ్ కావడంతో ప్రేక్షకులు పోటెత్తారు. ఈ సినిమాకు మార్నింగ్ షోకు 75 శాతం ఆక్యుపెన్సీ, మ్యాట్నీకి 80 శాతం, ఫస్ట్ షోకు 85 శాతం, సెకండ్ షోలకు 85 శాతం ఆక్యుపెన్సీ నమోదైందని ట్రేడ్ వర్గాలు, సాక్ నిల్క్ వెల్లడించింది.మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకానింగ్ సినిమాకు ఇండియాలో మిక్స్‌డ్ రెస్పాన్ వస్తున్నది. ఈ సినిమాపై అంచనాలు పెంచుకొన్న వారు కొంత అసంతృప్తికి గురైతే.. క్రూజ్ ఫ్యాన్స్ ఈ సినిమాను ఫుల్లుగా ఎంజాయ్ చేశామని చెబుతున్నారు. అయితే లాంగ్ రన్‌లో ఈ సినిమా బాక్సాఫీస్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుంది అనే అభిప్రాయాన్ని ట్రేడ్ సర్కిల్స్ వ్యక్తం చేస్తున్నాయి.దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకానింగ్ మూవీకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వ్యక్తమైంది. ముంబై, ఢిల్లీ, పూణే, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా, ఆహ్మదాబాద్, చెన్నై, కోచి తదితర నగరాల్లో ఈ సినిమాకు 60 నుంచి 75 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది. ఈ సినిమాకు తొలి రోజు భారీ వసూళ్లు రాబట్టే అవకాశం ఉంది అని సాక్ నిల్క్, ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.టామ్ క్రూజ్ నటించిన మిషన్ ఇంపాసిబుల్ 7 సినిమా తొలి రోజు సుమారుగా 17 కోట్ల రూపాయలు వసూలు చేసింది. మిషన్ ఇంపాసిబుల్ 8 సినిమా విషయానికి వస్తే.. ఈ చిత్రం ఇండియాలో 22 నుంచి 25 కోట్ల నెట్ కలెక్షన్లు వసూలు చేస్తుందని అంచనా వేశారు. ఇక అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాల్లో ఈ సినిమా 23వ తేదీన రిలీజ్ కానున్నది. ఇప్ప టికే ఈ సినిమాభారీగాఅడ్వాన్స్‌బుకింగ్ నమోదుఅవుతుంది.ఈ చిత్రం ఓవర్సీస్‌లో తొలి రోజు 600 మిలియన్ డాలర్లు వసూలు చేస్తుందని అంచనా వేస్తున్నారు.

# నాకు చాలా ఆఫర్స్ వచ్చాయి.. కానీ తాతయ్య కోరిక అదే - శోభన్ బాబు మనవడు




తెలుగు సినీ చరిత్రలో అందగాడు, సోగ్గాడు అనగానే గుర్తొచ్చే పేరు శోభన్ బాబు అంటే అతిశయోక్తి కాదు. టాలీవుడ్ కి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లు లాంటి వారు అని చెబుతూ ఉంటారు. ఆ తర్వాత తరంలో కృష్ణ, కృష్ణం రాజులతో పాటే సూపర్ స్టార్ గా ఎదిగారు శోభన్ బాబు. తనదైన నటనతో, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఈ మహానటుడు, తెలుగు వారి గుండెల్లో శాశ్వతంగా స్థానం సంపాదించుకున్నారు.అయితే తన కుటుంబ సభ్యులను మాత్రం సినిమా రంగానికి పరిచయం చేయకుండా దూరంగా ఉంచారు. కానీ ఆయన వారసులు మాత్రం ఇతర రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ శోభన్ బాబు పేరును నిలబెడుతున్నారు. ఆ క్రమంలోనే ఆయన మనవడు డాక్టర్ సురక్షిత్ బత్తిన, వైద్య రంగంలో ఓ అద్భుత విజయాన్ని సాధిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. చెన్నైలో ప్రముఖ గైనకాలజిస్ట్‌గా సేవలందిస్తున్న డాక్టర్ సురక్షిత్ ఇటీవల ఓ అరుదైన శస్త్రచికిత్స చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డును బ్రేక్ చేశారు. 44 ఏళ్ల మహిళ గర్భాశయంలో ఏర్పడిన 4.5 కిలోల సిస్టును, సాధారణంగా ఓపెన్ సర్జరీ చేయాల్సిన స్థితిలో ఉన్నా, అత్యాధునిక "ట్రూ 3డి ల్యాపరోస్కోపిక్" పద్ధతిలో తొలగించి చరిత్ర సృష్టించారు.ఈ మేరకు అప్పటి నుంచి వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తూన్నాడు వస్తోన్న సురక్షిత్. రీసెంట్ గా ఓ యూట్యూబ్ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు తెలుగు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్ గా మారాయి. సురక్షిత మాట్లాడుతూ.. తాతయ్య శోభన్ బాబు తన కుటుంబ సభ్యులను సినిమా ఇండస్ట్రీకి వద్దని చెప్పలేదని.. కానీ ఆయన కష్టాన్ని చూసి మేము ఆ ప్రయత్నం చేయలేదని చెప్పుకొచ్చారు. తనకు చాలా పెద్ద పెద్ద ఆఫర్లు కూడా వచ్చాయని స్పష్టం చేశారు. చిన్నప్పటి నుంచి తాను డాక్టర్ కావాలని తాతయ్య కోరుకున్నారని వెల్లడించారు. అందుకే ఆయన కోరిక ప్రకారం డాక్టర్ అయ్యానని.. ఇప్పుడు మంచి పొజిషన్ లో ఉన్న అంటూ చెప్పుకొచ్చారు. హీరోలకు ఏ మాత్రం తీసిపోకుండా ఉండే సురక్షిత్.. ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలవడం ప్రేక్షకుల్లో సైతం తన గురించి ప్రస్తావన వస్తూ ఉండడంతో ఇప్పటికే పలు ఆఫర్లు వచ్చాయని చెప్తున్న తరుణంలో రానున్న రోజుల్లో మరిన్ని ఆఫర్లు రావడం పక్కా అంటూ చెబుతున్నారు.

# 'ది ప్యారడైజ్' భారీ మార్పు..?




న్యాచురల్ స్టార్ నాని రీసెంట్‌గా 'హిట్-3' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చి బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నాడు. వైల్డ్ యాక్షన్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ సినిమాలో నాని పర్ఫార్మెన్స్‌కు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇక నాని తన నెక్స్ట్ చిత్రాన్ని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో ఇప్పటికే అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే.'ది ప్యారడైజ్' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాలో నాని సరికొత్త లుక్స్‌తో ప్రేక్షకులను స్టన్ చేయనున్నాడు. అయితే, ఈ చిత్రానికి సంబంధించి ఓ వార్త సినీ సర్కిల్స్‌లో జోరుగా వినిపిస్తోం ది. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ అందించేందుకు తొలుత జికె. విష్ణు ఈ ప్రాజెక్టు లోకి వచ్చారు. అయితే, ఇప్పుడు కొన్ని కారణా ల వల్ల ఆయన ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. దీం తో మరో టాప్ సినిమాటోగ్రాఫర్ కోసం చిత్ర యూనిట్ చూస్తున్నా రట. ఇక ఈ సినిమాలో అందాల భామ కయాదు లోహర్ హీరోయిన్‌గా నటించనుంది. అనిరుధ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# కింగ్ నాగ్ 'రగడ' మళ్లీ?



మన టాలీవుడ్ సీనియర్ హీరో కింగ్ నాగార్జున ఇప్పుడు పలు సాలిడ్ ప్రాజెక్ట్ లు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే నాగార్జున సినిమాల్లో మాస్ చిత్రాలకి కొంచెం స్పెసిఫిక్ స్పేస్ ఉంటుంది అని చెప్పవచ్చు. అలా తన నుంచి వచ్చిన కొన్ని పక్కా మాస్ చిత్రాల్లో దర్శకుడు వీరూ పోట్ల తో చేసిన "రగడ" కూడా ఒకటి. అందులో నాగ్ డైలాగ్ డెలివరీ కానీ, కామెడీ సీన్స్ ఇంకా మాస్ మూమెంట్స్ ఫాన్స్ కి ఇప్పటికీ స్పెషల్ గానే ఉంటాయి.మరి ఇలాంటి మాస్ చిత్రం మళ్లీ థియేటర్స్ లో అలరించేందుకు వస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతానికి రీరిలీజ్ సన్నాహాలు జరుగుతున్నాయి అని తెలుస్తోంది. ఇది అయ్యాక డేట్ వస్తుందట. డెఫినెట్ గా ఈ సినిమాకి కూడా మంచి రెస్పాన్స్ వచ్చే ఛాన్స్ ఉంది. ఇక ఈ సినిమాకి థమన్ సంగీతం అందించగా అనుష్క, ప్రియమణి హీరోయిన్స్ గా నటించారు.